జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP  సంపుటి : 1  సంచిక: 184  ఆదివారం  30 నవంబర్– 2025 పేజీలు : 4  వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## రైతన్నల్లారా..

## సమస్యలన్నీ పరిష్కరిస్తాం: సీఎం చంద్రబాబు



అమరావతి,(సందేశం టైమ్స్): రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం నాడు మీడియాతో సీఎం ఇష్టాగోష్టి నిర్వహించారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. రాజధాని రైతులంతా ఇక ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కింద అంతా ఒకే జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించామని.. కేంద్రంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని తెలిపారు.రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఆర్డీఏ అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

మిగతాది 2లో

## ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

## కె. విజయానంద్ పదవీకాలం పొడిగింపు



అమరావతి, (సందేశం టైమ్స్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పదవి కాలం మరో మూడు నెలలు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఈ నెలాఖరుతో విజయానంద్ పదవీకాలం ముగియనుంది. అయితే, అతని పదవీకాలం మరో మూడు నెలలు పొడిగించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది.

ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి కాలాన్ని కేంద్రం మరో మూడు నెలలు పొడిగించింది. కొద్దిసేపటి క్రితం దీనికి సంబంధించిన ఉత్తర్వులను కేంద్రం జారీ చేసింది.ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ రంగంలో 14 సంవత్సరాల అనుభవం కలిగిన అధికారి విజయానంద్. 2024 డిసెంబర్‌లో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ–2024' రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ పాలసీ రాష్ట్రాన్ని 160 రెన్యూవబుల్ ఎనర్జీ హబ్‌గా మార్చే లక్ష్యాన్ని పెట్టుకుంది. అలాగే, తుఫానుల సమయంలో ఎనర్జీ సరఫరాను నిర్వహించడంలో ఆయన తీరుకు ప్రశంసలు అందుకున్నారు.

మిగతాది 2లో

## ఆ జిల్లాలను అలర్ట్ చేయండి...

## దిత్వా తుఫానుపై అధికారులతో హోంమంత్రి



అమరావతి,(సందేశం టైమ్స్): నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాను నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత(శనివారం) సమీక్ష నిర్వహించారు. తుఫాను తీవ్రతను బట్టి ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అలర్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలన్నారు. రేపు, ఎల్లుండి ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమ య్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్ష సూచన ఉందని హోంమంత్రికి అధికారులు వివరించారు.

మిగతాది 2లో

## అమరావతి భూసేకరణపై

## మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శలు



2 లో

చంద్రబాబు అధికారంలోకి రాగానే భూముల ధరలు తగ్గాయన్న అంబటి

రాజధాని పేరుతో చంద్రబాబు దోచుకుంటున్నారని ఆరోపణ

## రెండో విడత అమరావతి భూసేకరణ:

## చంద్రబాబుకు షర్మిల సూటి ప్రశ్నలు

తొలివిడత భూముల్లో అభివృద్ధి చేయకుండా రెండో విడత సేకరణ ఎందుకని ప్రశ్న

ఇది రియల్ ఎస్టేట్ మాఫియా కాదా అని తీవ్ర స్థాయిలో ఆరోపణలు

రాజధాని భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



2 లో

## శ్రీలంకలో చిక్కుకుపోయిన తెలుగు పర్యాటకులు..


## మంత్రి లోకేశ్ సాయం



అమరావతి, (సందేశం టైమ్స్):దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో చిక్కుకుపోయిన తెలుగు పర్యాటకులను స్వదేశానికి రప్పించేందుకు మంత్రి లోకేశ్ చర్యలు తీసుకున్నారు. తెనాలి, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖ ప్రాంతాలకు చెందిన 25 మంది తెలుగు పర్యాటకులు ఏడు రోజుల పర్యటన నిమిత్తం శ్రీలంకకు వెళ్లారు. తుపాను కారణంగా అక్కడే చిక్కుకుపోయారు. తమను భారత్‌కు తీసుకురావాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. విమానాలూ రద్దయ్యాయని వారి దష్టికి తీసుకెళ్లారు. శ్రీలంకలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు ప్రజల విజ్ఞప్తిపై మంత్రి లోకేశ్ స్పందించారు. త్వరితగతిన భారత్‌కు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈమేరకు తన కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. కొలంబో, చెన్నై అధికారులతో తక్షణమే సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిక్కుకున్న ప్రయాణికులకు అవసరమైన సాయాన్ని అందించాలన్నారు.

## రాజధాని రైతుల సమస్యలు పరిష్కరిస్తాం :

## త్రిసభ్య కమిటీ



తుళ్లూరు, (సందేశం టైమ్స్): రాజధాని రైతులు లేవనెత్తుతున్న సమస్యలన్నీటినీ పరిష్కరిస్తామని కేంద్ర గ్రామీణాభివఅద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ హామీ ఇచ్చారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన త్రిసభ్య కమిటీ అమరావతిలోని రాయపూడి సి ఆర్ డి ఎ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులైన పెమ్మసాని చంద్ర శేఖర్, పురపాలక, పట్టణాభివఅద్ధి శాఖ మంత్రి పి.నారాయణ,

మిగతాది 2లో

## శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి రికార్డు రిజిస్ట్రేషన్లు



అమరావతి, (సందేశం టైమ్స్): తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల కోసం రికార్డు స్థాయి భక్తుల నమోదు జరిగింది. గత 48 గంటల్లో –దీప్ సిస్టమ్ ద్వారా 7.7 లక్షల రిజిస్ట్రేషన్లు జరగగా, మొత్తం 19.5 లక్షల మంది భక్తులు టోకెన్ల కోసం నమోదు అయ్యారని అధికారులు తెలిపారు.రెజిస్ట్రేషన్లు డిసెంబర్ 1 సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నాయి. టోకెన్లను పొందిన వారికి డిసెంబర్ 2న వారి మొబైల్ నంబర్ ద్వారా ద్వారా సమాచారం పంపబడుతుంది.

## మార్కెట్ లో రసాయన అగరుబత్తులు - అధికారి నోటీసులు



విజయనగరం, (సందేశం టైమ్స్): రసాయనాలతో తయారయిన అగరబత్తులను వాడొద్దు అని విజయనగరం మండల వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాస్ కోరారు. శనివారం విజయనగరం మార్కెట్ లో మారుతి ప్లాస్టిక్స్ అండ్ జనరల్ స్టోర్ లో అధికారులు సోదాలు నిర్వహించారు.

2 లో

## రైతన్నల్లారా.. సమస్యలన్నీ పరిష్కరిస్తాం: సీఎం చంద్రబాబు

త్వరలోనే ఆ దిశగా కార్యచరణ రూపొందిస్తామని ప్రకటించారు. రైతు సమస్యల పరిష్కారంలో తొలుత కొంత గ్యాప్ వచ్చిందని.. అయితే తనతో సమావేశం తర్వాత అన్నింటిపైనా స్పష్టత వచ్చిందని వెల్లడించారు.

రైతులు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలపై రైతులకు వివరించినట్లు చెప్పారు. మునిస్పాలిటీగా అమరావతి మిగిలిపోకుండా మహానగరంగా అభివృద్ధి చెందితే ఎలాంటి ఫలితాలు ఉంటాయో రైతులు అర్థం చేసుకున్నారన్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. రాజధాని అభివృద్ధి ఇక అన్ స్టాపబుల్ అని స్పష్టం చేశారు. రాజధాని చుట్టపక్కల ప్రాంతాల్లో లేఅవుట్లకు అనుమతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.కాగా.. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు చేరుకున్న సీఎం.. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అలాగే కొందరికి అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. సీఎంకు వినతులు ఇచ్చేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. దీంతో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యాలయ సిబ్బంది సీటింగ్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు ఎంతో ఓపిగ్గా ఒక్కొక్కరి వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

## అమరావతి భూసేకరణపై
## మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శలు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విస్తరణ కోసం ప్రభుత్వం మరోసారి భూసేకరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు చేశారు. అమరావతి కథ ఒక అంతులేని కథలా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతిలో భూముల ధరలు పడిపోయాయని వ్యాఖ్యానించారు.రాజధాని పేరుతో చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతూ దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. ఇప్పటికే రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాల భూములు త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూములతో కలిపి మొత్తం 50 వేల ఎకరాలతో ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నిర్మిస్తానని గతంలో చంద్రబాబు ప్రగల్భాలు పలికారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ భూసేకరణకు ఎందుకు సిద్ధమవుతున్నారని ఆయన ప్రశ్నించారు.ప్రభుత్వ నిర్ణయాల వల్ల అమరావతి రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంపై స్పష్టత ఇవ్వకుండా, పదేపదే భూసేకరణ అనడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమేనని ఆయన అన్నారు. ప్రభుత్వ తీరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

## రెండో విడత అమరావతి భూసేకరణ:
## చంద్రబాబుకు షర్మిల సూటి ప్రశ్నలు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధాని కోసం రెండో విడత భూసేకరణ చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఇది రియల్ ఎస్టేట్ మాఫియాను తలపిస్తోందని ఆరోపించారు. "మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె కావాలా?" అన్నట్లుగా చంద్రబాబు తీరు ఉందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు.

తొలి విడతలో సేకరించిన 54 వేల ఎకరాల్లో ప్రపంచ స్థాయి నగరం ఎక్కడ నిర్మించారని షర్మిల ప్రశ్నించారు. రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాల్లో ఒక్క కిలోమీటర్ నిర్మాణం కూడా జరగలేదని, ఐకానిక్ భవనాల ఊసే లేదని విమర్శించారు. అలాంటిది ఇప్పుడు కొత్తగా మరో 16 వేల ఎకరాలు ఎందుకని నిలదీశారు. అదానీ, అంబానీలకు బాకీ పడ్డారని భూములు సేకరిస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు.దేశంలోని అతిపెద్ద విమానాశ్రయాలు, అంతర్జాతీయ క్రీడా నగరాలతో పోలుస్తూ అమరావతికి వేల ఎకరాలు ఎందుకని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. ముంబై విమానాశ్రయానికి 1850 ఎకరాలు, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 2200 ఎకరాలు సరిపోయినప్పుడు, అమరావతికి 5 వేల ఎకరాలు అవసరమా అని అడిగారు. బీజింగ్, లండన్ ఒలింపిక్స్ స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల్లోనే ఉండగా, ఇక్కడ 2500 ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు.

## ఆ జిల్లాలను అలర్ట్ చేయండి...
## దిత్వా తుఫానుపై అధికారులతో హోంమంత్రి

దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లతో అనిత ఫోన్లో మాట్లాడారు.ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులకు, ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లను 24/7 కొనసాగించాలని ఆదేశించారు. విపత్తుల సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళల్లో ఉండే వారిని గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు.అవసరమైతే ప్రజలను సహాయక శిబిరాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. విరిగిన చెట్లు తొలగించడం , విద్యుత్తు అంతరాయం జరిగితే పునరుద్ధరణ పనులు వెంటనే జరిగేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్నపుడు వీలైనంత వరకు ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని హోంమంత్రి సూచనలు చేశారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బలమైన ఈదురుగాలుల వీచేప్పుడు చెట్లు, హోర్డింగ్స్ వద్ద ఉండవద్దని ప్రజలు హోంమంత్రి అనిత కీలక సూచనలు చేశారు.

## మార్కెట్ లో రసాయన అగరుబత్తులు -
## అధికారి నోటీసులు

సుమారు రూ.8 వేల విలువ కలిగిన సరుకుల అమ్మకాలను ఆపాల్సిందిగా వెంటనే స్టోర్ యజమానికి నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ %ెౌ%. వ్యవసాయ కమిషనర్ ఉత్తర్వుల మేరకు స్లీప్ వెల్ అగరబత్తులలో %ఎవజూవతీటశ్రీబ్ప్రతీఱఅ% అనే క్రిమిసంహారకం కలపడం వలన పీల్చిన వారిలో శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉత్పత్తి అమ్మకాలు నిలుపవలసి ఉందని చెప్పారు. ప్రజలు దయచేసి ఎవ్వరూ ఈ అగరబత్తులను వాడకూడదని కోరారు.

## రాజధాని రైతుల సమస్యలు పరిష్కరిస్తాం : త్రిసభ్య కమిటీ

ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తోపాటు సి ఆర్ డి ఎ కమిషనర్ కె కన్నబాబు, ఎడిసి చైర్ పర్సన్ డి లక్ష్మీ పార్థ సారధి, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ శ్రీ వాత్సవ, రైతులు పాల్గన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ %ెౌ% సిఎం ఆదేశాల మేరకు రైతుల సమస్యలపై త్రిసభ్య కమిటీ రెండున్నర గంటలపాటు సమీక్ష జరిపిందన్నారు. 1280 రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో వీధిపోట్లు, శూల, రోడ్డు పోట్లు సమస్యలు ఉన్నాయని, అయితే వీరిలో 998 మంది ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ లు చేసుకున్నారని చెప్పారు. కేవలం 156 మంది రైతులకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాస్తు ప్రకారం లాటరీ పద్దతిలో వారికి వేరే చోట ప్లాట్లు కేటాయిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి, చేయించుకున్నవారికి తిరిగి ప్రభుత్వం ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పిస్తామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా 10 సెంట్లకు మించి గ్రామ కంఠాలను కేటాయిస్తే వాటిని ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని చెప్పారు. అలా చేయని పక్షంలో సమస్య పరిష్కారం కాదన్నారు. ప్రత్యేకంగా కొంతమంది అధికారులను నియమించి గ్రామ కంఠాల సర్వేను పగడ్బందీగా నిర్వహిస్తామన్నారు. లంక భూముల రిజిస్ట్రేషన్ కు చర్యలు తీసుకున్నామని, అసైన్డ్ భూముల అంశాన్ని ప్రత్యేకంగా కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ల్యాండ్ పూలింగ్ లో 2,492 ఎకరాల భూములను రైతులు ఇవ్వలేదని, వీటిలో 45 కోర్టు కేసులు ఉండగా, 17 కేసులు విత్ డ్రా అయ్యాయని, 28 కేసులు మాత్రమే ఉన్నాయని పెమ్మసాని చెప్పారు. డిసెంబర్ 10 నాటికి భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి నిబంధనల ప్రకారం భూములు తీసుకుంటామన్నారు. ల్యాండ్ పూలింగ్ లో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. ల్యాండ్ పూలింగ్ లో ఇవ్వని రైతుల భూముల్లో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించడం జరిగిందని, ఆ భూములను భూ సేకరణ ద్వారా తీసుకోవడానికి సమయం పడుతుందన్నారు. కొద్ది విస్తీర్ణం కలిగిన 3 4 సెంట్లు ప్లాట్లకు ప్రత్యామ్నాయంగా వేరే చోట ప్లాట్లు ఇస్తామని, పెద్ద రైతులైతే సమస్య పరిష్కారానికి మూడు, నాలుగు నెలలు ఓపిక పట్టాలన్నారు. తొందరగా కావాలంటే పెద్ద ప్లాట్లను ముక్కలుగా విభజించి పక్క గ్రామాల్లో, లేదంటే ఇంకో గ్రామంలో ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయిస్తామన్నారు. 400, 220 కెవి విద్యుత్ లైన్ ఏర్పాటు గురించి చెబుతూ, 400 కెవి విద్యుత్ లైన్ లు రైతుల పొలాల్లో వస్తున్నాయని, ఈ అంశం కోర్టులో ఉందన్నారు. హెల్త్, పెన్షన్ కార్డులలో మార్పులు, మంజూరు, తదితర సమస్యలను ఇంటింటికీ తిరిగి నెలరోజుల్లో పరిష్కరించాలని సి ఆర్ డి ఎ అధికారులకు చెప్పడం జరిగిందన్నారు

## ఉపాధ్యాయులకు ఆదర్శం కేశవరెడ్డి




(సందేశం టైమ్స్): నేటితరం ఉపాధ్యాయులకు ప్రముఖ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, అనువాదకులు కొమ్మారెడ్డి కేశవరెడ్డి ఆదర్శమని పలువురు వక్తలు తెలిపారు. కేశవరెడ్డి సాహితీ పురస్కారం-2025 ప్రదాన సభకు గుంటూరు జిల్లా బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించారు. స్థానిక రచయిత, అనువాదకులు మోదుగుల రవికృష్ణకు కేశవరెడ్డి సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేశవరెడ్డి సాధారణ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిగా, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకులుగా పనిచేశారని, గొప్ప అనువాదకులుగా పేరుగాంచారని తెలిపారు. గణిత ఉపాధ్యాయుడు అయినప్పటికీ సాహిత్య రంగంలో రాణించడం విశేషమన్నారు. గోర్కి నవల, ఇఎంఎస్ నంబూద్రిపాద్ రచించిన స్వాతంత్ర్య ఉద్యమం పుస్తకంలోని కొంత భాగంతోపాటు పలు జాతీయ, అంతర్జాతీయ రచనలను తెలుగులోకి అనువదించారన్నారు. కేశవరెడ్డి సామాజిక దృక్పదాన్ని ఉపాధ్యాయులు అందిపుచ్చుకోవాలని కోరారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ మరుగున పడిన తెలుగు సాహిత్యాన్ని నేటి తరానికి అందించటానికి వాటిని సరళతరం చేసే కృషిలో వందకుపైగా పుస్తకాలకు రవికృష్ణ అనువాదం చేశారన్నారు. చరిత్ర, సైన్స్, ఆంగ్ల, సైద్ధాంతిక సాహిత్యం పట్ల కేశవరెడ్డి అపారమైన విజ్ఞానం సంపాదించారని వివరించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేశవరెడ్డి సాహితీ కృషిని భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో ఆయన కుటుంబం ప్రతి ఏటా పురస్కారం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం మోదుగుల రవికృష్ణను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు రాజశేఖర్‌రావు, ఎం కళాధర్, కేశవరెడ్డి కుటుంబ సభ్యులు ఆంజనేయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జాషువా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎన్ కాళిదాసు తదితరులు పాల్గన్నారు.

## అట్టహాసంగా పల్నాడు బాలోత్సవం
## జిల్లా స్థాయి 3 వ పిల్లల పండుగ



నరసరావుపేట (పల్నాడు జిల్లా)(సందేశం టైమ్స్): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం ఎస్.ఎస్.ఎన్ కళాశాల ప్రాంగణంలో పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 2 రోజులపాటు జరగనున్న పల్నాడు బాలోత్సవం జిల్లా స్థాయి 3వ పిల్లల పండుగ సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. అంతరించిపోతున్న దేశ సంస్కృతీ సాంప్రదాయాలు, చిన్నారులలో సృజనాత్మకత, దేశభక్తి, అభ్యుదయ భావాలు ఇముడింపజేసేందుకు పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. పోటీలలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా 200 లకు పైగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ఆయా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ప్రదర్శన ఇవ్వనున్నారు. మొత్తం 69 అంశాల్లో జరగనున్న పోటీలు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికలపై ఏక కాలంలో పోటీలు జరుగనున్నాయి. కోలాటం, శాస్త్రీయ నృత్యం, బుర్రకథ, లఘు నాటికలు, విచిత్ర వేషధారణ వంటి అంశాలు బాలోత్సవంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ కేటగిరిలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## నారాయణపల్లెలో పర్యటించిన
## సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీకాంత్




పుట్లూరు (అనంతపురం) (సందేశం టైమ్స్): మండలంలోని సి.వెంకన్నపల్లి గ్రామపంచాయతీ నారాయణపల్లి ఆవాసానికి కమిషనర్ పంచాయతీ రాజ్ విజయవాడ నుండి సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ జి. శ్రీకాంత్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.ఎన్ సునీల్ కుమార్ ఎం. కోనయ్య ఎస్. టి. యం గ తాడిపత్రి ఏ.పీ.డి పుల్లారెడ్డి ,ఎంపీడీవో అలివేలమ్మ , ఏం తులసి ప్రసాద్ ఏ.పీ.ఓ టెక్నికల్ అసిస్టెంట్లు ఈ పంచాయతీని శనివారం విజిట్ చేయడం జరిగింది .గత 3 మాసాల క్రితం ఈ గ్రామ పంచాయతీ నందు సోషల్ ఆడిట్ టీం వారు మరియు ఇతర శాఖల అధికారుల తో చర్చించిన అంశాల పైన పురోగతి ఏమైనా ఉందా అనే అంశాల పైన శనివారం డైరెక్టర్ మరొకసారి గ్రామ సభ ద్వారా చర్చించడం జరిగింది ఉన్నత స్థాయి అధికారులకు పంపవలసినటువంటి సమస్యలను స్వీకరించడం జరిగింది ప్రధానంగా గ్రామానికి 1తారు రోడ్డు 2. స్ట్రీట్ లైట్స్ 3.డ్రైనేజ్ గురించి అడగడం జరిగింది ఇంకా ఈ సమావేశము నందు సాంకేతిక సహాయకులుగంగాదేవి ఆంజనేయులు రామాంజనేయులు శంకర్ బి ఎఫ్ టి లు ప్రసాద్ రామంజి రెడ్డి పంచాయతీ సెక్రెటరీ గంగాదేవి గ్రామంలో ఉన్నటువంటి ప్రజలు హాజరు కఅదేవిధంగా క్షేత్ర సహాయకులు వినోద్ కుమార్ రెడ్డి, మనోహర్ రెడ్డి హాజరు కావడం జరిగింది.

# 76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన మాదిరి ప్రిథ్వీరాజ్...





సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి : 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన పటాన్‌చెరు పట్టణంలోని 18 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేందుకు %వీణ=% ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ గారి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో రెండు వేలకుపైగా విద్యార్థులు పాల్గొన్నారు. విభిన్న పాఠశాలల నుండి ఎంపికైన 180 మంది ప్రతిభావంతులైన విజేతలకు ఈ రోజు పటాన్‌చెరువు జేపీ లయన్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. అదే సందర్భంలో రాజ్యాంగం, పౌర హక్కులు మరియు బాధ్యతలపై అవగాహన సదస్సును కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువజన సంఘాల సమితి అధ్యక్షుడు కూన వేణు , సంగారెడ్డి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీరాములు , పటాన్‌చెరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వినాయక రెడ్డి , షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి నాయకులు రుద్రారం శంకర్ , సిపిఐ నాయకులు ప్రకాశ్ రావు , పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ ప్రవీణ , రిటైర్డ్ హెడ్మాస్టర్ %ఉ% అడ్వకేట్ మామిళ్ల కిషన్ కుమార్ , ఉపాధ్యాయులు సాయి తేజ , ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ , అడ్వకేట్ విజయ్ కుమార్ , మహేష్ , రిటైర్డ్ ఆర్మీ ఎన్.ఎస్.జి కమాండో మున్నా గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ, “విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు, హక్కులు మరియు బాధ్యతలపై అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్‌లో బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దడం మా ప్రధాన లక్ష్యం” అని పేర్కొన్నారు.

# సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మాల జేపీసీ ఆధ్వర్యంలో మీటింగ్...






సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి (నవంబర్ 29): తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి నియోజకవర్గం ఆందోల్ నియోజకవర్గం జహీరాబాద్ నియోజకవర్గం, పటాన్ చెరు నియోజకవర్గం, నారాయణఖేడ్ నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి జిల్లాలో మాల సంఘాల జేఏసీని పటిష్టపం చాలని,తెలంగాణ రాష్ట్రంలో మాల వాళ్లకు జరుగుతున్న అన్యాయం మీద పోరాటాలకు సిద్ధంగా ఉండాలని జరుగుతున్న అన్యాయం మీద పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గౌరవ చైర్మన్ చెరుకు రామచందర్,గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్.. మాల విద్యార్థి జేఏసీ అధ్యక్షులు మాదాసు రాహుల్ రావు విజ్ఞప్తి చేశారు... సంగారెడ్డి జిల్లా మాల సంగాల జేఏసీ కన్వీనర్ గా బైండ్ల అశోక్ కుమార్ గారిని కన్వీనర్ గా నియమించడం జరిగింది. వారితో పాటు కోకన్వీనర్లుగా మీడియా ఇన్చార్జిలుగా ఎన్నికైన వారిని శాలువాలతో సత్కరించారు.

# భారీ ర్యాలీ తో నామినేషన్ వేసిన బహిరన్ డిబ్బ సర్పంచ్ అభ్యర్థి పంపాటి వీరప్ప






సందేశం టైమ్స్ : నారాయణాఖేడ్ ఇంచార్జి నవంబర్ 30: గ్రామ పంచాయతి ఎన్నికల నామినేషన్లు శనివారమే చివరి రోజు కావడంతో అల్లాదుర్గం మండలంలో సందడి నెలకొంది వివిధ పార్టీ ల అభ్యర్థులు సర్పంచులు వార్డ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసారు. సర్పంచ్ అభ్యర్థి పంపాటి వీరప్ప. నాయకులు యువత అందరు కలసి డప్పు చెపుల్లతో ర్యాలీగా వచ్చి ఘనంగా నామినేషన్ మండల అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు చెనప్ప. ప్రభు.మఠం వీరయ్య స్వామి. కృష్ణ. పాపయ్య. బకయ్య. రాజు స్వామి. పార్టీ సినియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మగ్దూం మోహియుద్దీన్ అందోలు ప్రెస్ అసోసియేషన్ ఏర్పాటు

## -యూనియన్ బలోపేతానికి కృషి చేస్తాం గౌరవ అధ్యక్షులు చాపల సత్యం

## -జర్నలిస్టులపై దాడులను సహించేది లేదు అధ్యక్షులు మెట్టు రమేష్





సందేశం టైమ్స్:అందోల్ నియోజకవర్గం ప్రతినిధి 29,నవంబర్: సంగారెడ్డి జిల్లా: ఆందోల్ నియోజకవర్గంలో మగ్ధూం మోహియుద్దీన్ ప్రెస్ అసోసియేషన్ ను విలేకరులు ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి అసోసియేషన్ కమిటీని కూడా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నాడు ఏడుపాయల లొ ప్రసిద్ధిగాంచిన వన దుర్గామాత ఆలయంలో అమ్మవారి దీవెనలు అందుకున్నారు రిజిస్ట్రేషన్ కు సంబంధించిన పత్రాలతో ఆ యూనియన్ విలేకరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం తో పాటు నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రమాణస్వీకారం అలాగే సన్మాన కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు చాపల సత్యం, నూతన అధ్యక్షులు మెట్టు రమేష్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని అలాగే విలేకరుల సమస్యల పరిష్కారం కోసం ఎంతటి ఉద్యమానైనా చేపడతామని వారు అన్నారు. ప్రభుత్వపరంగా అందే జర్నలిస్టుల సంక్షేమ ఫలాలను యూనియన్ సభ్యులందరికి అందే విధంగా తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం జర్నలిస్టులపై, గ్రామీణ ప్రాంత విలేకరులపై సమాజంలో జరుగుతున్న దాడులు గాని అక్రమ కేసులను కానీ సహించేది లేదని పేర్కొన్నారు. విలేకరులు. ఒకవైపు ప్రజా సమస్యలను మరోవైపు ప్రభుత్వ వైఫల్యాలను అందరికీ తెలిసే విధంగా వార్తలను ప్రచురించాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడని పడే విధంగా వార్తలు రాస్తూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే విధంగా వార్తలు రాయాలని సూచించారు. త్వరలోనే జోగిపేట పట్టణంలో యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కమిటీ గౌరవాధ్యక్షులు చాపల సత్యం ముదిరాజ్, తో పాటు నూతన కమిటీ అధ్యక్షులు. మెట్టు రమేష్, ఉపాధ్యక్షులు జెల్ల భాగయ్య, ప్రధాన కార్యదర్శి బేగారి దాసయ్య, సంయుక్త కార్యదర్శి మేకటి ప్రేమ్ కుమార్, కార్యదర్శి లింగాన్ని గారి ప్రసాద్ గౌడ్, సహాయ కార్యదర్శి సుకుమార్, ప్రచార కార్యదర్శి మన్నే పోచయ్య, కోశాధికారి తమ్మలి సంగమేశ్వర్, మైనార్టీ సెల్ కార్యదర్శి షాహేద్ పాష, సలహాదారులు కూసంగి మహేష్, బుచ్చయ్య, కార్యవర్గ సభ్యులుగా మక్షుద్, ఖలీల్, నాగరాజు, దానంపల్లి సత్యం, ప్రభాకర్, మల్లేశం గౌడ్, రాజు, యాదగిరి, ప్రవీణ్ కుమార్, జయసింహ, సత్య కృష్ణ, తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# అందోలు మగ్దూం మోహియుద్దీన్ ప్రెస్ అసోసియేషన్ ఏర్పాటు





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 29నవంబర్: సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో మగ్ధూం మోహియుద్దీన్ ప్రెస్ అసోసియేషన్ ను విలేకరులు ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి అసోసియేషన్ కమిటీని కూడా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రసిద్ధిగాంచిన వన దుర్గామాత ఆలయంలో రిజిస్ట్రేషన్ కు సంబంధించిన పత్రాలతో ఆ యూనియన్ విలేకరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గ రమణ స్వీకారంతోపాటు నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రమాణస్వీకారం ఉత్సవం అలాగే సన్మాన కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు చాపల సత్యం, నూతన అధ్యక్షులు మెట్టు రమేష్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని అలాగే విలేకరుల సమస్యల పరిష్కారం కోసం ఎంతటి ఉద్యమానైనా చేపడతామని వారు అన్నారు. ప్రభుత్వపరంగా అందే జర్నలిస్టుల సంక్షేమ ఫలాలను యూనియన్ సభ్యులందరికి అందే విధంగా తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం జర్నలిస్టులపై, గ్రామీణ ప్రాంత విలేకరులపై సమాజంలో జరుగుతున్న దాడులు గాని అక్రమ కేసులను కానీ సహించేది లేదని పేర్కొన్నారు. తమ యూనియన్ పోరాటం చేస్తుందన్నారు. విలేకరులు ఒకవైపు ప్రజా సమస్యలను మరోవైపు ప్రభుత్వ వైఫల్యాలను అందరికీ తెలిసే విధంగా వార్తలను ప్రచురించాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడని పడే విధంగా వార్తలు రాస్తూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే విధంగా వార్తలు ఇవ్వాలని వారు సూచించారు. త్వరలోనే జోగిపేట పట్టణంలో యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కమిటీ గౌరవాధ్యక్షులు చాపల సత్యం ముదిరాజ్, తో పాటు నూతన కమిటీ నూతన కమిటీ అధ్యక్షులు మెట్టు రమేష్, ఉపాధ్యక్షులు జెల్ల భాగయ్య, ప్రధాన కార్యదర్శి బేగారి దాసయ్య, సంయుక్త కార్యదర్శి మేకటి ప్రేమ్ కుమార్, కార్యదర్శి ప్రసాద్ గౌడ్, సహాయ కార్యదర్శి సుకుమార్, ప్రచార కార్యదర్శి మన్నే పోచయ్య, కోశాధికారి తమ్మలి సంగమేశ్వర్, మైనార్టీ సెల్ కార్యదర్శి షాహేద్ పాష, సలహాదారులు కూసంగి మహేష్, బుచ్చయ్య, కార్యవర్గ సభ్యులుగా మక్షుద్, ఖలీల్, నాగరాజు, దానంపల్లి సత్యం, ప్రభాకర్, మల్లేశం గౌడ్, రాజు, యాదగిరి, ప్రవీణ్ కుమార్, జయసింహ, సత్య కృష్ణ, తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# రోలెక్స్ వాచీ చోరీ కేసు..
# పోలీస్ కానిస్టేబుల్ అరెస్ట్..




హైదరాబాద్, నవంబరు29(సందేశం టైమ్స్): నగరంలో ఇటీవల ఓ నకిలీ ఐపీఎస్ అధికారిని అరెస్ట్(చేసే క్రమంలో.. అతడి ఇంట్లో చోరీకి గురైన రోలెక్స్ వాచీ దొంగను పట్టుకున్నారు పోలీసులు. నిందితుణ్ని అదుపులోకి తీసుకునే తరుణంలో శ్రీరాములు శరణ్ కుమార్(అనే పోలీస్ కానిస్టేబులే వాచీని కాజేసినట్టు తేలింది. దీంతో సదరు పోలీస్ ఉద్యోగిని ఫిల్మ్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైదరాబాద్ఏరియాలో ఇటీవల తాను ఐపీఎస్ అధికారినంటూ శశికాంత్అనే వ్యక్తి కొన్నిరోజులుగా హల్‌చల్ చేశాడు. విషయం బయటపడటంతో ఆ నకిలీ అధికారిని అదుపులోకి తీసుకునేందుకు అతడి ఇంటికెళ్లారు పోలీసులు. ఈ అరెస్ట్ ఘటననంతా శ్రీరాములు శరణ్ కుమార్ అనే కానిస్టేబుల్ వీడియో తీశాడు. ఈ తరుణంలో ఆ ఇంట్లో ఉన్న రోలెక్స్ వాచీపై కన్నేసి.. దాన్ని కాజేశాడా కానిస్టేబుల్ తాను తీసిన వీడియోలో కనిపించకుండా చాకచక్యంగా అపహరించి జేబులో వేసుకున్నాడు. అయితే.. ఇంకో కానిస్టేబుల్ తీసిన వీడియోలో ఇతడి చేతివాటం బయటపడింది. దీంతో సదరు కానిస్టేబుల్‌ను దొంగగా గుర్తించారు పోలీసులు. సెక్షన్ 316(5) ప్రకారం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం.. శ్రీరాములు శరణ్ కుమార్‌పై శాఖా పరమైన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమైంది.

# సిరిసిల్లలో
# తల్లీ కొడుకుల ఆత్మహత్య



తంగళ్లపల్లి,నవంబరు29(సందేశం టైమ్స్): మానసిక స్థితి సరిగా లేక తల్లి.. తన తల్లి ఇక లేదన్న మనస్థాపంతో కొడుకు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో చోటు చేసుకుంది. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం తంగళ్లపల్లి మండల కేంద్ర వాని మంచికట్ల లలిత(56)కి పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కొడుకు అభిలాష్(34) ఉన్నాడు. ఆమె మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో అభిలాష్ ఆందోళన చెందుతున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికొచ్చేసరికి తల్లి కనిపించలేదు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం సిరిసిల్లలోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో మానేరు నదిలో బయట పడ్డ మహిళ మృతదేహం తల్లిదేనని గుర్తించాడు. మనస్థాపానికి గురైన అభిలాష్.. బంధు మిత్రులు చూస్తుండగానే తానూ నదిలో దూకేశాడు. దీంతో అతడి మిత్రులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం 2 గంటలు గాలించిన తర్వాత అభిలాష్ మృతదేహం బయట పడింది. అవివాహితుడైన అభిలాషకు వివాహితులైన ఇద్దరు చెల్లెళ్లున్నారు. తండ్రి దేవరాజు ఐదేళ్ల క్రితమే ప్రమాదవశాత్తు మరణించాడు.

# పేరు సరిపోలలేదని పరీక్ష నిరాకరణ



హసన్‌పర్తి, నవంబరు29(సందేశం టైమ్స్): ఆర్ఆర్‌బీ నిర్వహించిన ఉద్యోగ పరీక్షకు హాజరైన ఓ ట్రాన్స్‌జెండర్ అభ్యర్థికి అధికారులు షాకిచ్చారు. అన్ని అధికారిక ప్రక్రియలు పూర్తిచేసి, పరీక్ష హాల్‌కు చేరుకున్నప్పటికీ.. ధ్రువీకరణ పత్రాలలో పేరు సరిపోలడం లేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ ఆమెను పరీక్ష రాయడానికి తిరస్కరించారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా శంభునిపేటకు చెందిన అజయ్ సింగ్ అలియాస్ అక్షయ .. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ట్రాన్స్‌జెండర్‌గా మారి పేరు మార్చుకుంది. అనంతరం ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. ఈ క్రమంలోనే పదో తరగతి మెమోలో ఉన్న భూక్య అజయ్‌సింగ్ పేరుతోనే ట్రాన్స్‌జెండర్‌గా ఉద్యోగ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. అదే పేరుతో ఆర్ఆర్‌బీ హాల్ టికెట్ జారీ చేసింది. అదే హాల్‌టికెట్‌తో పరీక్ష రాసేందుకు కేంద్రానికి చేరుకుంది. ఎస్ఎస్‌సీ మెమోలో పేరు అజయ్‌సింగ్ అని ఉండగా.. ఆధార్, పాన్‌కార్డులో మాత్రం అక్షయగా ఉందంటూ పరీక్ష హాల్ నుంచి బయటకు పంపించారు. దీంతో అక్షయ బోరున విలపిస్తూ నిరాశతో ఇంటి దారి పట్టింది. ధ్రువీకరణ పత్రాల్లో పేర్లు సరిపోలక పరీక్షకు నిరాకరించడం పట్ల ట్రాన్స్‌జెండర్ యాక్టివిస్ట్ రేఖ ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రయాణం కష్టతరం.. మంచిర్యాలలోని ప్రధాన
# కూడళ్ల వద్ద వాహనదారులు ఆగమాగం



మంచిర్యాల టౌన్, నవంబరు29(సందేశం టైమ్స్):మంచిర్యాల పట్టణంలోని ప్రధాన రహదారిపై ప్రయాణం కష్టంగా మారింది. ముఖ్యంగా లక్ష్మీటాకీసు, వెంకటేశ్వర టాకీసు చౌరస్తాల వద్ద జంక్షన్‌లు కూల్చివేయడంతో రాకపోకలకు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఐబీ చౌరస్తా నుంచి మందమర్రి, బెల్లంపల్లి వైపునకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రహదారిని ఆనుకుని ఇరుపక్కలా పలు కాలనీలున్నాయి. ఈ ప్రాంత వాసులు తమ వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఆర్టీసీ బస్సులతో పాటు భారీ వాహనాలు సైతం ఈ రోడ్డుపై నుంచి వెళుతుంటాయి. %నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా ఉండడం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐబీ నుంచి లక్ష్మీటాకీసు వరకు నాలుగుచోట్ల రూ. నాలుగు కోట్లు వెచ్చించి జంక్షన్‌లను నిర్మించింది. వాటిని ఎంతో ఆకర్శనీయంగా, సుందరంగా తీర్చిదిద్దింది. ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహంతో పాటు, పార్లమెంట్ భవనాన్ని పోలిన ప్రతిమ, వెంకటేశ్వర టాకీసు చౌరస్తాలో వివిధ కుల వృత్తుల వారికి సంబంధించిన నమూనాలు, బెల్లంపల్లి చౌరస్తాలో త్రివిధ దళాలకు చెందిన ప్రతిమలు, లక్ష్మీటాకీసు చౌరస్తాలో పలు పక్షులు, సీతాకోక చిలుకలకు సంబంధించిన బొమ్మలు ఏర్పాటు చేసింది.కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నర కాకముందే లక్ష్మీటాకీసు, వెంకటేశ్వర టాకీసు జంక్షన్‌లను కూల్చివేశారు. వీటి స్థానంలో చిన్న సైజులో జంక్షన్‌లు నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. జంక్షన్‌లను కూల్చి ఆరు నెలలు గడుస్తున్నా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంపై పట్టణ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జంక్షన్‌లను కూల్చిన ప్రాంతంలో వాహనాలు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందంటున్నారు.

# కోకాపేటలో కోట్లవర్షం!



హైదరాబాద్ సిటీ,నవంబరు29(సందేశం టైమ్స్): భూముల వేలంతో కోకాపేట కోట్లపేటగా మారింది. మూడేళ్ల క్రితం ఇక్కడ ఎకరం ధర రూ.100 కోట్లు పలుకగా.. మూడు రోజుల క్రితం ఎకరం రూ.135 కోట్లు పలికింది. తాజాగా ఎకరం రూ.151.25 కోట్లు పలకడం విశేషం. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కోకాపేటలోని నియో పోలీస్ లేఔట్‌లో గల 15, 16 నెంబర్ల ప్లాట్లను ఆన్‌లైన్‌లో వేలం వేశారు. నియో పోలీసు లేఅవుట్‌కు ముఖద్వారంగా ఉన్న 15వ నెంబరు ప్లాటు 4.03 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. ఈ ప్లాటుకు ఉత్తరం, తూర్పు భాగాల్లో 150 అడుగుల రోడ్డు ఉండడంతో పలువురు డెవలపర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు కొనుగోలు చేయడానికి పోటీపడ్డాయి. ఉదయం 11 గంటలకు ప్లాట్ల వేలం ప్రారంభమవగా రాత్రి 7 గంటల వరకు హోరాహోరీగా సాగింది. ఎకరాకు కనీస ధర రూ. 99 కోట్లుగా హెచ్ఎండీఏ అధికారులు నిర్ణయించారు. అయితే 4.03 ఎకరాల విస్తీర్ణంలోని 15వ నెంబరు ప్లాట్‌ను ఎకరం రూ.151.25 కోట్ల చొప్పున లక్ష్మీనారాయణ గుమ్మడి, కార్తీష్ రెడ్డి మాడుగుల, శరత్ వెంట్రప్రగడ, శ్యామ్ సుందర్ రెడ్డి వంగాల కలిసి కొనుగోలు చేశారు. 5.03 ఎకరాల విస్తీర్ణంలోని 16వ నెంబరు ప్లాటును రూ.147.75 కోట్లకు గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ అనే సంస్థ కొనుగోలు చేసింది. ఈ రెండు ప్లాట్ల విక్రయం ద్వారా హెచ్ఎండీయేకు రూ. 1,353 కోట్లు సమకూరాయి. సోమవారం కోకాపేటలో రెండు ప్లాట్ల విక్రయంతో హెచ్ఎండీఏకు రూ.1,357 కోట్ల ఆదాయం వచ్చిన విషయం విదితమే. ఇప్పటి వరకు కోకాపేట భూముల అమ్మకంతో హెచ్ఎండీఏకు రూ. 2,710 కోట్లు సమకూరాయి. డిసెంబరు 3, 5 తేదీల్లో కోకాపేటలో 2, మూసాపేటలో 15 ఎకరాల స్థలాల్ని వేలం వేయనున్నారు.

# గిరిజన తండాల్లో పోలీసుల దాడులు..
# మహారాష్ట్ర దేశీదారు పట్టివేత



కుభీర్ :నవంబరు29(సందేశం టైమ్స్): నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని మార్లగొండ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం నందపహాడ్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు( నిర్వహించారు. ఈ సందర్భంగా నిలువ ఉంచిన మహారాష్ట్ర మద్యం(దేశీదారు) పట్టుకున్నట్లు కుభీర్ ఎస్సై ఏ కృష్ణారెడ్డి తెలిపారు.%ఈ దాడుల్లో 171 దేశీదారు సీసాలు పట్టుకుని స్వాధీన పర్చుకున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి మద్యం, నగదు స్టాక్ చేయరాదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# పక్కా ప్లాన్‌తో మత్తు వదిలించారు



హైదరాబాద్/ న్యూఢిల్లీ, నవంబరు29(సందేశం టైమ్స్): రాష్ట్రంలోని మల్నాడు రెస్టారెంట్‌లో డ్రగ్స్ తీగ దొరికింది.. అదేమిటని లాగుతూ వెళితే ఢిల్లీలో ఓ నైజీరియన్ వరకు వెళ్లింది. అదేదో పెద్ద వ్యవహారంలా ఉందని గట్టిగా ప్రయత్నిస్తే ఏకంగా భారీ నైజీరియన్ డ్రగ్స్ కార్టెల్ డొంక కదిలింది. వినూత్నంగా వస్త్రాలు, బూట్లు, సౌం దర్య ఉత్పత్తుల పార్సిళ్లలో వాటితోపాటు డ్రగ్స్ పెట్టి సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ గుట్టు బయటపడింది. మల్నాడు రెస్టారెంట్ కేసులో ఢిల్లీ నుంచి వచ్చిన పార్సిల్‌ను స్వాధీనం చేసుకున్న ఈగిల్ అధికారులు.. అందులోని చెప్పుల్లో డ్రగ్స్‌ను గుర్తించారు. ఆ పార్సిల్‌ను ఢిల్లీ నుంచి పంపిన నైజీరియన్‌ను గుర్తించి, నాలుగు నెలల క్రితం ఆపరేషన్ ప్రారంభించారు. సుమారు 15 రోజులు పూర్తిగా ఢిల్లీలోనే మకాం వేశారు. డ్రగ్స్ ముఠా అడ్డాల్లో మఫ్టీలో తిరుగుతూ వివరాలన్నీ సేకరించారు. అక్కడి పోలీసులతో కలసి సంయుక్త ఆపరేషన్ చేపట్టి.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఈగిల్ బృందం ఎస్పీ సీతారాం, ఢిల్లీ క్రైం బ్రాంచ్ జాయింట్ కమిషనర్ సురేంద్రకుమార్ ఈ ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. ఢిల్లీ, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా 'ఆపరేషన్ ఈగిల్ ఫోర్స్' చేపట్టినట్టు తెలిపారు. మెహ్రౌలీ, సంత్‌ఘర్, నిలోథి, ప్రతాప్ ఎన్‌క్లేవ్, గ్రేటర్ నోయిడా, మునిర్కా తదితర 18 ప్రాంతాల్లో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో తెలంగాణ నుంచి 180 మంది పోలీసులు పాల్గొన్నారని చెప్పారు. గ్రేటర్ నోయిడాలో డ్రగ్స్ ముఠా ఆర్థిక వ్యవహారాలు చూసే కీలక వ్యక్తి బద్రుద్దీన్‌ను అరెస్టు చేశామని, ఆయన భార్య కూడా ఈ దందాలో పాలుపంచుకుంటున్నట్టు గుర్తించామని తెలిపారు. తెలంగాణ పోలీసులు ఏడుగురిని, ఢిల్లీ పోలీసులు ముగ్గురిని కలిపి మొత్తం కలిపి 10 మంది కీలక సూత్రధారులను, మరో 30 మంది నైజీరియన్లను అరెస్టు చేశామని తెలిపారు. కాగా, డ్రగ్స్‌ను అరికట్టడంలో తెలంగాణ ఈగిల్ బృందం కృషిని సురేంద్రకుమార్ అభినందించారు.కాగా, ఆపరేషన్ ఈగిల్ ఫోర్స్‌లో 5,340 ఎక్స్‌స్టసీ పిల్స్, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథామ్‌ఫిటమిన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఈగిల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఈ డ్రగ్స్ విలువ రూ.3.5 కోట్లు ఉంటుందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 2 వేల మందికిపైగా వినియోగదారులు, పెడ్లర్లకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు గుర్తించామన్నారు.

# పురుగుల అన్నం ఎట్లా తినేది.. రోడ్డుపై
# బైఠాయించి నిరసన తెలిపిన విద్యార్థులు

కొమురంభీం ఆసిఫాబాద్ నవంబరు29(సందేశం టైమ్స్): జిల్లాలోని కౌటల మండల కేంద్రం ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని ఆరోపిస్తూ విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి భోజనం ప్లేట్లతో బైఠాయించి ఆందోళన నిర్వహించారు.%పాఠశాల సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు విద్యార్థులు నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయింపు వల్ల ఇరువైపుల రాకపోకలు నిలిచిపోయాయి . అధికారులు సమాధానం చెప్పేంతవరకు నిరసనను విరమించుకునేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. అక్కడికి వచ్చిన విద్యాధికారులు విద్యార్థులకు సర్దిచెప్పడంతో ఆందోళనను విరమించుకున్నారు.

(Sandesham Times) TG TEL/25/A0348“Title: Sandesham Times“Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206“Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,“3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206“ Phone: 9052045435.“Printed at: Sunday Printing Press,“3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006